RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:72 | ఫిబ్రవరి 24, 2026 | వెల: రూ.3-00



## తెలంగాణలో చిరుజల్లులు

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం

2లో



ఇసుకాసురులు!

# నదీ గర్భాన్ని తోడేస్తుండ్రు!

- రాత్రి పగలు తేడా లేకుండా జేసీబీలతో తవ్వకాలు
- అడ్డగోలుగా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా
- పరిమితికి మించి తవ్వకాలు
- అధికారులకు చేతినిండా ముడుపులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- నీరు లేక అవస్థలు పడుతున్న నదీ పరీవాహక ప్రజలు
- ప్రశ్నిస్తే భౌతిక దాడులు.. ట్రాక్టర్లతో తొక్కేయడాలు

2లో

## గోదావరి, మానేరు, మున్నేరును మింగేస్తున్న ఇసుక మాఫియా!

**వేద న్యూస్, ఫోకస్ టీం**

ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ఇసుక మాఫియా బరితెగిస్తోంది. గోదావరి, మానేరు, మున్నేరు నదుల సాక్షిగా రాత్రిపగలు తేడా లేకుండా వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో నదీ సంపదను కొల్లగొడుతున్నారు. పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కి, జేసీబీలతో నదీ గర్భాలను గుల్ల చేస్తూ అగాధాలను సృష్టిస్తున్నారు. ఈ భారీ దోపిడీ వెనుక కొందరు అధికారుల ముడుపుల అండ దండలు ఉండటంతో, ఒకే పర్మిట్‌పై పది ట్రిప్పుల ఇసుక సరిహద్దులు దాటుతోంది. ఫలితంగా భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయి పల్లెల్లో తాగునీటి ఎద్దడి తీవ్రమవుతుండగా, ఈ అక్రమాలను ప్రశ్నించిన వారిపై మాఫియా భౌతిక దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తోంది. ప్రభుత్వ ఆదాయానికి కోట్లాది రూపాయల గండి కొడుతున్న ఈ ఇసుక తోడేళ్ల మాయాజాలంపై 'వేద న్యూస్' ప్రత్యేక కథనం..

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



- రేపటి నుంచి మార్చి 18 వరకు
- హాజరుకానున్న 9,97,075 మంది విద్యార్థులు
- 30 వేల సీసీ కెమెరాల నిఘాలో నిర్వహణ

2లో

## రైతు రుణమాఫీ ఏమైంది?

ఇంకా 15 లక్షల మంది ఎదురుచూస్తున్నారు

- కృష్ణమ్మ, తుంగభద్ర ప్రవహిస్తున్నా నడిగడ్డకు నీళ్లు అందడం లేదు
- నత్తనడకన తుమ్మిళ్ల, నెట్టెంపాడు పనులు
- సీడ్ పత్తి రైతుల బకాయిల విడుదల చేయాలి
- రైతు సంఘర్షణ సభలో కల్వకుంట్ల కవిత
- ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు
- కలెక్టరేట్ ముట్టడి, వినతిపత్రం అందజేత



2లో

## ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం ఫొటోపై చర్చ

- రేవంత్ రెడ్డి ఫొటోతో పాటు భట్టి ఫొటో పెట్టేందుకు ప్రతిపాదన
- సుప్రీంకోర్టు వ్యాఖ్యల అనంతరం రాజకీయ చర్చ
- క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం సాధ్యమేనా?

2లో



## ప్రభుత్వ ఆధీనంలోకి 'మెట్రో'!

తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం

ఎల్‌అండ్ టీ నుంచి పూర్తి బాధ్యతల స్వీకరణకు ఆమోదం

- పర్యవేక్షణకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉపసంఘం
- రూ.2 వేల కోట్ల ఈక్విటీ చెల్లింపు, రూ.13 వేల కోట్ల రుణ బదలాయింపు
- ప్రయాణికులకు మెరుగైన సదుపాయాల కల్పన లక్ష్యంగా నిర్ణయం
- ఇక సేవల్లో పెరుగనున్న పారదర్శకత



2లో

## ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ ఫొటోపై చర్చ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫోటో కూడా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటో ఏర్పాటు అంశంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేస్తూ, డిప్యూటీ సీఎం ఫోటో ఉండటంలో తప్పేమీ లేదని వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో రాష్ట్రాల్లో ఉప ముఖ్యమంత్రుల అధికారిక ప్రాధాన్యతపై కొత్త చర్చ మొదలైంది. ఇదే నేపథ్యంలో తెలంగాణలోని ప్రభుత్వ కార్యాలయాల్లో భట్టి విక్రమార్క ఫోటో కూడా ఏర్పాటు చేయాలనే ఆలోచనకు వేగం వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. క్యాబినెట్ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించే అవకాశముందని సమాచారం. ప్రభుత్వ పరిపాలనలో ఉప ముఖ్యమంత్రి బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని ఫోటో ఏర్పాటు చేయాలనే అభిప్రాయం కొందరు నేతలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంపై తుది స్పష్టత క్యాబినెట్ చర్చల అనంతరం వెలువడే అవకాశముంది. రాష్ట్ర రాజకీయాల్లో ఈ అంశం మరోసారి చర్చకు దారి తీస్తోంది.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

### రేపటి నుంచి మార్చి 18 వరకు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్న పరీక్షల నిర్వహణపై ఇంటర్ బోర్డు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి కృష్ణాదిత్య కీలక వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా, మొదటి సంవత్సరం నుంచి 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,07,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 404 ప్రభుత్వ కళాశాలలు, 221 ఎయిడెడ్ కళాశాలలు, 863 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, 7 ఇతర విద్యాసంస్థలను ఎంపిక చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేట్ కళాశాలలు అధికంగా ఉండగా, మిగతా జిల్లాల్లో ప్రభుత్వ కళాశాలలకు ప్రాధాన్యత ఇచ్చారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా దాదాపు 30 వేల సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని, అయితే సమయపాలన పాటించాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులను బయటకు పంపబోమని, ప్రశ్నాపత్రాలు కూడా బయటకు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హాల్ టికెట్ల వివాదాలపై స్పందిస్తూ, ఫీజులు చెల్లించలేదనే కారణంతో ఎవరినీ ఇబ్బంది పెట్టబోమని తెలిపారు. కోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు కూడా హాల్ టికెట్లు జారీ చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారని, విద్యుత్, రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు కృష్ణాదిత్య వెల్లడించారు.

## తెలంగాణలో చిరుజల్లులు

- హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం
- నైరుతి బంగాళాఖాత ద్రోణి ప్రభావం
- మరికొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాల సూచన

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఎండలు ముదురుతున్న వేళ హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. మధ్యాహ్నం వరకు మండిన ఎండ తర్వాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, కాచిగూడ, కొండాపూర్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, ఉప్పల్, మాసాబ్ ట్యాంకు తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. వర్షంతో ఉక్కపోత తగ్గి ప్రజలకు ఉపశమనం లభించింది. కరీంనగర్ ప్రాంతంలోనూ ఆకాశం మబ్బులతో కమ్ముకుని జల్లులు కురిశాయి. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్ల ఈ వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. వాతావరణంలో ఆకస్మిక మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు తెలిపారు. నిజామాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, మెదక్, సిద్దిపేట, వికారాబాద్, కామారెడ్డి, మంచిర్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## రైతుల రుణమాఫీ ఏమైంది?

### రైతు సంఘర్షణ సభలో కల్వకుంట్ల కవిత

**వేద న్యూస్, జోగులాంబ గద్వాల**

రైతుల రుణమాఫీ విషయంలో పూర్తి న్యాయం జరగలేదని, ఇంకా 15 లక్షల మంది రైతులు ఎదురుచూస్తున్నారని, ప్రతి రైతుకు రుణమాఫీ చేయాల్సిందేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు సంఘర్షణ సభలో కవిత పాల్గొన్నారు. సభ అనంతరం రైతుల సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి పెద్ద ఎత్తున రైతులతో కలిసి కలెక్టరేట్‌కు బయలుదేరారు. పోలీసుల అనుమతి లేదని గేటుకు తాళం వేయడంతో కవితతో పాటు రైతులు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సభలో మాట్లాడుతూ.. తెలంగాణలో కుల వివక్షకు తావుండకూడదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. జోగులాంబ అమ్మవారిపై తనకు ప్రత్యేకమైన భావోద్వేగం ఉందని, భవిష్యత్ కార్యక్రమాలను గద్వాల్ నుంచే ప్రారంభిస్తామని ప్రకటించారు. నాగర్ కర్నూల్ ఘటనలో చిన్నారి మృతి బాధాకరమని పేర్కొంటూ మౌనం పాటించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్రను గుర్తుచేసి, రాబోయే సామాజిక ఉద్యమంలో కూడా వారు ముందుండాలని విజ్ఞప్తి చేశారు. సీడ్ పత్తి రైతుల బకాయిలు వారం రోజుల్లో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, లేదంటే దీక్షకు దిగుతామని హెచ్చరించారు. అర్ధరాత్రి కరెంట్ సరఫరా, యూరియా కొరత, యాప్ ద్వారా బుకింగ్ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని విమర్శించారు. కృష్ణమ్మ, తుంగభద్ర నదులు ప్రవహిస్తున్నా నడిగడ్డకు నీళ్లు అందడం లేదని, తుమ్మిళ్ల, నెట్టింపాడు పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు.

# నదీ గర్భాన్ని తోడేస్తుండ్రు!

### గోదావరి, మానేరు, మున్నేరును మింగేస్తున్న ఇసుక మాఫియా!

- రాత్రి పగలు తేడా లేకుండా జేసీబీలతో తవ్వకాలు
- అడ్డగోలుగా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా
- పరిమితికి మించి తవ్వకాలు
- అధికారులకు చేతినిండా ముడుపులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- నీరు లేక అవస్థలు పడుతున్న నదీ పరీవాహక ప్రజలు
- ప్రశ్నిస్తే భౌతిక దాడులు.. ట్రాక్టర్లతో తొక్కేయడాలు



**వేద న్యూస్, ఫోకస్ టీం**

తెలంగాణ జీవనాధారాలైన గోదావరి, మానేరు, మున్నేరు నదులు ఇప్పుడు ఇసుక మాఫియా పాలిట వరంగా మారాయి. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల పరిధిలో ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, నదీ గర్భాలను యంత్రాలతో గుల్ల చేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లు నదీ సంపదను కొల్లగొడుతున్నాయి. ఒక్కో జిల్లా నుంచి ప్రతిరోజూ వందల ట్రిప్పుల ఇసుక అక్రమంగా సరిహద్దులు దాటుతున్నా అడిగే నాథుడే కరువయ్యారు. నదీ గర్భంలో ఇసుక మాఫియా జేసీబీలతో పంజా విసురుతోంది. పర్యావరణ నిబంధనల ప్రకారం నదిలో నిర్ణీత లోతు వరకు మాత్రమే ఇసుక తీయాల్సి ఉండగా, ఇసుకాసురులు మాత్రం అగాధాలను సృష్టిస్తున్నారు. జేసీబీలతో ఇష్టారాజ్యంగా తవ్వేస్తుండటంతో నదులు తమ సహజత్వాన్ని కోల్పోతున్నాయి. తవ్విన ఇసుకను నిల్వ చేయడానికి నదీ పరివాహక ప్రాంతాల్లోనే రహస్య స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి, రాత్రికి రాత్రే భారీ వాహనాల్లో తరలిస్తున్నారు.

**అధికారులకు ముడుపులు**

ఈ భారీ దోపిడీ వెనుక 'ముడుపుల' వ్యవస్థ పని చేస్తోంది. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలకు చెందిన కొందరు అధికారులు మాఫియాతో చేతులు కలిపారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెక్‌పోస్టుల వద్ద కళ్లు మూసుకుని వాహనాలను వదిలేయడానికి భారీగా నెలవారీ మామూళ్లు అందుతున్నట్లు సమాచారం. ఒక పర్మిట్‌తో పది ట్రిప్పులు వేయడం, నకిలీ వే బిల్లులు సృష్టించడం లేదా అసలు పర్మిట్లే లేకుండా అడ్డదారిలో తరలించడం ఇక్కడ నిత్యకృత్యమైంది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన కోట్లాది రూపాయల ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి చేరుతోంది.

**రాత్రి పగలు తేడాలేకుండా..**

ఇసుక రీచుల ముసుగులో జరుగుతున్న 'మాయాజాలం' అంతా ఇంతా కాదు. ప్రభుత్వ అనుమతి ఉన్న రీచులే అక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. అనుమతి పొందిన విస్తీర్ణం కంటే రెట్టింపు స్థలంలో ఇసుకను తవ్వడం, పట్టా భూముల పేరుతో నదీ ప్రవాహాన్ని మళ్లించి మరీ తోడేయడం మాఫియా వ్యూహం. ఆన్‌లైన్ సిస్టమ్‌ను బురిడీ కొట్టిస్తూ, పర్మిట్ సమయం దాటినా అదే బిల్లుతో తోలకాలు సాగిస్తున్నారు. జిల్లా దాటితే ఇసుక ధరకు రెక్కలు వస్తుండటంతో, లోకల్ పర్మిట్లతో ఇతర జిల్లాలకు, పొరుగు రాష్ట్రాలకు గుట్టుచప్పుడు కాకుండా పంపిస్తున్నారు.

**అడుగంటుతున్న భూగర్భ జలాలు**

ప్రకృతిపై జరుగుతున్న ఈ దాడి సామాన్య ప్రజల గొంతు కోస్తోంది. ఇసుక పొరలు నదిలో నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచుతాయి. కానీ ఇసుక మొత్తం మాయం కావడంతో భూగర్భ జలాలు లోతుకు పడిపోయాయి. ఎండకాలం సమీపిస్తుండటంతో నదీ పరీవాహక గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రతరమవుతోంది. బోర్లన్నీ ఎండిపోయి, బావులు అడుగంటి గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ బావుల్లో నీరు లేక పంటలు ఎండిపోతుంటే రైతులు కన్నీరు పెడుతున్నారు.

**ప్రశ్నిస్తే దాడులే..**

ఇసుక మాఫియా ఆగడాలను ప్రశ్నిస్తే దాడులు తప్పడం లేదు. ఈ దోపిడీని అడ్డుకోవాలని చూసిన స్థానిక యువకులను, గ్రామస్తులను అరాచక శక్తులు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులు చేయడం, వాహనాలతో తొక్కించే ప్రయత్నం చేయడం వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారులు కూడా మాఫియా పక్షాన నిలబడి ఫిర్యాదుదారులనే వేధిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనిఖీలకు వచ్చే ముందే మాఫియాకు సమాచారం అందుతుండటంతో అక్రమార్కులు తప్పించుకుంటున్నారు.

# ప్రభుత్వ ఆధీనంలోకి 'మెట్రో'!

- తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం
- ఎల్అండ్ టీ నుంచి పూర్తి బాధ్యతల స్వీకరణకు ఆమోదం
- పర్యవేక్షణకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉపసంఘం
- రూ.2 వేల కోట్ల ఈక్విటీ చెల్లింపు, రూ.13 వేల కోట్ల రుణ బదలాయింపు
- ప్రయాణికులకు మెరుగైన సదుపాయాల కల్పన లక్ష్యంగా నిర్ణయం



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ సంస్థ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో ప్రాజెక్ట్‌ను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనకు మంత్రివర్గం ఈరోజు అధికారిక ఆమోదం తెలిపింది. నగర ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో, ఆర్థిక వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. మెట్రో స్వాధీన ప్రక్రియను సమర్థంగా అమలు చేయడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావులను సభ్యులుగా నియమించారు. ఈ ఉపసంఘం ఆర్థిక, న్యాయ, పరిపాలనా అంశాలను పరిశీలిస్తూ స్వాధీన ప్రక్రియను పర్యవేక్షించనుంది. గత సంవత్సరం జరిగిన సూత్రప్రాయ ఒప్పందం ప్రకారం ఎల్అండ్టీకి రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించడంతో పాటు, సుమారు రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకోవాలని అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ ప్రక్రియ అప్పటినుంచి దశలవారీగా కొనసాగుతోంది. మెట్రో ఆర్థిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి, సేవలను మరింత సమర్థంగా నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగర రవాణా రంగంలో దీర్ఘకాలిక ప్రణాళికల అమలు, విస్తరణ ప్రాజెక్టుల వేగవంతం, ప్రయాణికులకు మెరుగైన సదుపాయాల కల్పన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వర్గాలు వెల్లడించాయి. మెట్రో స్వాధీనం అనంతరం సేవల నాణ్యత, నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

### ఆపదలో ఉన్న ఉద్యోగులకు

# మేమున్నామంటూ..!

**ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి నేతృత్వంలో మానవతా పరిమళం**

- కష్టమొచ్చిదంటే బాధితులకు భరోసా
- తహసీల్దార్ ఇక్బాల్ ఉదారత ఎనలేనిది
- అదే బాటలో జూనియర్ అసిస్టెంట్ రాజు సైతం..
- వృత్తి బాధ్యతలతో ప్రజలకు సేవచేస్తున్న 'సంక్షేమ' వారధులు



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

వృత్తిని దైవంగా భావించి ప్రజలకు సేవ చేయడమే కాకుండా, తనతో పాటు పనిచేసే తోటి ఉద్యోగులకు ఏదైనా ఆపద వస్తే నేనున్నాను అంటూ భరోసా ఇస్తున్నారు ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి. ఏ కష్టం వచ్చినా వెనుకాడకుండా ఆర్థికంగా, మానసికంగా అండగా నిలుస్తూ ఆయన తనదైన శైలిలో సేవా పథంలో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకోలేని స్థితిలో ఉన్న ఉద్యోగుల కుటుంబాలను ఆదుకుంటూ ఆయన ఒక ఆపద్బాంధవుడిగా మారారు.

**'ఆయన వల్లే ఈరోజు నేను బతికి ఉన్నాను'.. గరికపాటి ఉపేందర్**

జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి సేవా హృదయానికి గ్రామ పాలన ఆఫీసర్స్ స్టేట్ ప్రెసిడెంట్ గరికపాటి ఉపేందర్ సాక్ష్యంగా నిలుస్తున్నారు. 'నాకు కిడ్నీ సమస్య వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు, వైద్య ఖర్చుల నిమిత్తం లచ్చిరెడ్డి తక్షణమే స్పందించి రూ. 5 లక్షల భారీ ఆర్థిక సహాయం చేశారు. ఆయన చేసిన ఆ సాయం వల్లే ఈరోజు నేను ప్రాణాలతో ఉండి సమాజానికి సేవ చేయగలుగుతున్నాను'.. అంటూ ఉపేందర్ భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు. కేవలం ఒక నాయకుడిగానే కాకుండా, కష్టాల్లో ఉన్న ప్రతి ఉద్యోగిని తన కుటుంబ సభ్యుడిలా భావించి ఆదుకోవడంలో లచ్చిరెడ్డి చూపిస్తున్న చొరవ అభినందనీయం.

**మానవత్వం చాటుకుంటున్న తహసీల్దార్ ఇక్బాల్**



మంచిర్యాల జిల్లా, తాండూరు మండల తహసీల్దార్ ఇక్బాల్ సైతం సేవా గుణంలో ఎవరికీ తీసిపోరని నిరూపిస్తున్నారు. తన కార్యాలయ సిబ్బందికి ఏ కష్టం వచ్చినా ఆయన ముందుంటారు. తాండూరు తాసీల్దార్ కార్యాలయ ఉద్యోగి ఏకైక కుమార్తె (3 ఏళ్లు) స్కూల్ ఆటో నుంచి పడిపోయి కిడ్నీ, కాలేయం, వెన్నుముకకు తీవ్రమైన గాయాలైన క్లిష్ట సమయంలో ఇక్బాల్ స్పందించారు. ఆ చిన్నారి సర్జరీకి రూ. 20 లక్షల ఖర్చవుతుందని తెలిసి, నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి తక్షణ సాయంగా తన సిబ్బందితో కలిసి రూ. 30 వేల ఆర్థిక సాయం అందజేశారు. అంతేకాదు... పక్షవాతం బారిన పడి కటిక పేదరికంలో ఉన్న వరంగల్ మున్సిపాలిటీ మాజీ కార్పొరేటర్‌కు ఇక్బాల్ ప్రతినెలా రూ. 2వేలు చొప్పున పెన్షన్ తరహాలో సాయం అందిస్తున్నారు. వైద్య ఖర్చులకు ఈ మొత్తం ఎంతో ఊరటనిస్తోందని సదరు బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు.

**ఆపదలో ఆదుకున్న కోమండ్ల రాజు**



ఈ సేవా యజ్ఞంలో తనవంతు పాత్రను పోషిస్తున్నారు జూనియర్ అసిస్టెంట్ కోమండ్ల రాజు. ఏదైనా ప్రమాదం జరిగినా, ఆసుపత్రి ఖర్చులు భారమైనా రాజు స్పందిస్తున్న తీరు ప్రశంసనీయం. ఒక రోజు విధులకు వెళ్తుండగా ప్రమాదానికి గురైన జీపీఓ బి. రజిత పరిస్థితిని తెలుసుకున్న రాజు.. హైదరాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లి మరీ ఆమెను పరామర్శించారు. తోటి ఉద్యోగులను సమన్వయం చేసి సుమారు లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని సేకరించి, ఆమెకు మెరుగైన వైద్యం అందేలా చూశారు. 'క్లిష్ట సమయంలో రాజు చేసిన సాయం మరువలేను' అని రజిత పేర్కొన్నారు.

**తోటి వారిపై ప్రేమాభిమానం**

ఈ ముగ్గురు వి.లచ్చిరెడ్డి, ఇక్బాల్, కోమండ్ల రాజు.. తమ వృత్తిని దైవంగా భావిస్తూనే, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, వీరి సేవా దృక్పథం ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు మార్గదర్శకంగా నిలుస్తోంది. ఇలాంటి వారు ఉన్నంత కాలం ఉద్యోగ కుటుంబాలకు ఎటువంటి భయం ఉండదని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 24, 2026

# పాలన అంశాలపై అధికారులు దృష్టి పెట్టాలి

- దిశ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

సత్తుపల్లిలో అటవీ ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేక మార్ట్ నిర్మాణానికి గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా రూ.10 లక్షల ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. నేలకొండపల్లి, ధంసలాపురం, వెంకటగిరి ప్రాంతాల్లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై నివేదిక అందించాలని ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పరిపాలన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు పలు దిశానిర్దేశాలు చేశారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల పురోగతిపై క్రమం తప్పకుండా నివేదిక ఇవ్వాలని, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక మానిటరింగ్ చేయాలని తెలిపారు. భూసేకరణకు సంబంధించిన కోర్టు కేసుల్లో సకాలంలో కౌంటర్లు దాఖలు చేయాలని సూచించారు. వైరా, ఏదులాపురం మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డుల కోసం స్థలం ఖరారు చేయాలని, యూఎల్బీల పరిధిలో పెండింగ్ పనులపై తరచుగా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పీఎం శ్రీ పాఠశాలలకు సంబంధించిన బిల్లులను త్వరగా క్లెయిమ్ చేయాలన్నారు. ఫిబ్రవరి 27న జరిగే దిశ సమావేశానికి ప్రతి అధికారి పూర్తి సమాచారంతో హాజరుకావాలని, స్త్రీనిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కార్మిక శాఖ అధికారికి ఏఐటీయూసీ వినతిపత్రం



**వేద న్యూస్, మెట్‌పల్లి:**

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కార్మిక శాఖ అధికారి ఆర్. కృష్ణసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐసిబిడబ్ల్యూ జాతీయ కమిటీ నిర్ణయం మేరకు ఫిబ్రవరి 23న నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమానికి సంబంధించిన డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎశమేని గణేష్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. సహజ మరణానికి రూ.5 లక్షల పరిహారం, ప్రసూతి సహాయం, వివాహ కానుకలను రూ.1 లక్షకు పెంచాలని డిమాండ్ చేశారు. డెత్ క్లెయిమ్ ఇన్సూరెన్స్‌ను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించిన విధానాన్ని రద్దు చేయాలని, సంక్షేమ బోర్డుకు కార్మిక సంఘాల ప్రతినిధులతో పాలక మండలి వెంటనే నియమించాలని కోరారు. తెలంగాణలో జీవో నెం.12 సవరణ చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎండి ఉస్మాన్, సమీర్, ఖాతా వినయ్, మాతంగి శ్రావణ్, చౌదరి శివకుమార్, జనగాం రమేష్, మారంపల్లి రాజశేఖర్, తులసి రాజు తదితరులు పాల్గొన్నారు.

# జీవ వైవిధ్య పరిరక్షణ-యువత సాధికారతే లక్ష్యం

- అంతర్జాతీయ యువ జీవ వైవిధ్య సదస్సు ముగింపు వేడుకల్లో మంత్రి కొండా సురేఖ

**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో జీవ వైవిధ్య పరిరక్షణతో పాటు యువత సాధికారతను లక్ష్యంగా పెట్టుకుని నిర్వహించిన అంతర్జాతీయ యువ జీవ వైవిధ్య సదస్సు–2026 ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి యువత, పర్యావరణ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విధాన రూపకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమానికి అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సదస్సులో జీవ వైవిధ్య సంరక్షణ, పర్యావరణ అనుకూల జీవనశైలి (పర్యావరణం కోసం జీవనశైలి (లైఫ్)), యువత నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై సాంకేతిక సదస్సులు, చర్చలు నిర్వహించారని,యువతలో పర్యావరణ అవగాహన పెంపొందించడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన ఆవిష్కరణలు, పరిశోధనలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. జీవ వైవిధ్య సంరక్షణ రంగంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అంతర్జాతీయ వేదికపై




ప్రతిష్ఠాత్మకంగా నిలుస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ తరాల కోసం ప్రకృతి సంపదను కాపాడే దిశగా యువత ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత, డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం, కేంద్రం సహ–స్థాపకులు మరియు సీఈఓ సృజన్ పాల్ సింగ్, అలాగే తెలంగాణ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సభ్య కార్యదర్శి కాలీచరణ్ పాల్గొన్నారు.

# ఘనంగా పోలేరమ్మ బోనాలు



**వేద న్యూస్, మెట్‌పల్లి:**

మెట్‌పల్లిలో విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో పోలేర మ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా సంఘం అధ్యక్షుడు వంగళ మహేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్ర మాలు శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. కార్యక్రమం లో తోగిటి విద్యాసాగర్, శ్రీపాద సతీష్, కలిగొట లక్ష్మణు, మల్యాల శేఖర్, గాలిపెల్లి నాగరాజు, కోటగిరి తిరుమలాచారి, శ్రీనివాస్, మహేందర్, అనిల్, వేణు, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై బోనాలను విజయవంతం చేసినట్లు అధ్యక్షుడు వంగళ మహేష్ తెలిపారు. పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమం భక్తి వాతావరణంలో సాగింది.

# జన సం‘క్షేమమే’ లక్ష్యం

- ప్రజలిచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తా
- జమ్మికుంట మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ ఫెరోజ్

**వేద న్యూస్, జమ్మికుంట:**





తనకు అండగా నిలిచి తనను గెలిపించిన జనం సం‘క్షేమం’, అభివృద్ధి కోసం తాను చిత్తశుద్ధితో పని చేస్తానని జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు కౌన్సిలర్ ఫెరోజ్ ఎంఏ పేర్కొన్నారు. తనను 106 ఓట్ల మెజారిటీతో కౌన్సిలర్‌గా వార్డు ప్రజలకు ధన్యావాదాలు తెలిపారు. తాను తొలుత సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పైనా ఫోకస్ చేస్తానని, వార్డు పరిధిలోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. వార్డు పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. తాను మున్సిపల్ ఎన్నికల సమయంలో పేర్కొన్న హామీల అమలుకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. వార్డు పరిధిలో ఆడపిల్ల పెళ్లికి కానుకగా రూ.5,016, అలాగే ఆడ పిల్ల పుట్టిన సందర్భంలో రూ.5,016 ఇస్తానని తెలిపారు. ప్రతీ 3 నెలలకోసారి వార్డు పరిధిలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తానని, అదే విధంగా గతంలో మాదిరిగానే నిరుపేదలు, ఆసరా లేని వృద్ధులైన తల్లిదండ్రులకు నిత్యావసరాలను తన సొంత నిధులతో అందజేస్తానని, సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తానని వివరించారు.

# పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా కట్టుబడి పనిచేస్తున్నాం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజ్ ఉన్నత పాఠశాలలో బాలవికాస్ సేవాసంస్థ మరియు అమెజాన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రూ.8 లక్షల విలువైన 20 ల్యాప్‌టాప్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. నిర్మాణంలో ఉన్న పాకశాల భవనాన్ని పరిశీలించి, పనులు



మధ్యంతరంగా అసంపూర్తిగా ఉన్నాయని తక్షణమే ఎమ్మెల్యే నిధులనుంచి 5 లక్షలను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ డిజిటల్ యుగంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో వెనుకబడకూడదనే ఉద్దేశంతో కార్పొరేట్ సంస్థలు, సేవా సంస్థల సహకారాన్ని సమన్వయం చేస్తున్నామని తెలిపారు. బాలవికాస్ సంస్థ సేవా దృక్పథాన్ని అభినందిస్తూ, గ్రామీణ వాతావరణం కలిగిన సోమిడి, దర్గా, వడ్డేపల్లి, శాయంపేట ప్రాంతాల పాఠశాలల్లో కూడా మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కోరినట్లు చెప్పారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక నిధులు కేటాయించి తరగతి గదుల మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు వంటి పనులు చేపట్టామని వెల్లడించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి కోసం కంప్యూటర్ విద్య, ఆంగ్ల భాషా ప్రావీణ్యం, పోటీ పరీక్షల దిశగా మార్గదర్శక శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. హనుమకొండ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివి ఉన్నత స్థానాలకు ఎదిగిన పూర్వ విద్యార్థులు తమ పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. “ప్రభుత్వ పాఠశాల బలపడితేనే సమాజం బలపడుతుంది” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు విష్ణురెడ్డి , జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,కార్పొరేటర్ పోతుల శ్రీమాన్,బాల వికాస్ సంస్థ ప్రతినిధి షౌర్ రెడ్డి, డీఈఓ,డివిజన్ అధ్యక్షులు శివాజీ,బాలవికాస్ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కరాటే పోటీలో సైనిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**వేద న్యూస్, మందమర్రి:**



మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని కృష్ణ గార్డెన్‌లో ఆదివారం మాన్య మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో లతా నవోదయ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి పలు బహుమతులు సాధించారు. సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను ప్రిన్సిపాల్ లతా నాగరాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. కరాటే వంటి క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడమే కాక క్రమశిక్షణను పెంచుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వన్ టైం రిజిస్ట్రేషన్ గడువు మరో పది రోజులు పొడిగించాలి

- టీపీఎస్సీ కార్యాలయంలో బీసీ జేఏసీ వినతిపత్రం



**వేదన్యూస్, దామరచర్ల:**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీపీఎస్సీ) ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం వన్ టైం రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) గడువును ఈ నెల 25 వరకు నిర్ణయించడంతో, ఆ గడువును మరో పది రోజులు పొడిగించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్ సోమవారం టీపీఎస్సీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ.. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు కూడా తమ విద్యార్హతలు, ధ్రువీకరణ పత్రాలు తదితర వివరాలను తిరిగి అప్డేట్ చేయాలని సూచించడంతో పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు ఒకేసారి వివరాలు అప్లోడ్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దీంతో సర్వర్ బిజీ సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం గడువు ముగియడానికి కొద్దిరోజులే మిగిలి ఉండటంతో పలువురు అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వన్ టైం రిజిస్ట్రేషన్ గడువును కనీసం మరో పది రోజులు పొడిగించాలని టీపీఎస్సీని కోరినట్లు తెలిపారు.

# విజయాలకు చిరునామా 'ప్రసంగి'

- రాష్ట్ర స్థాయి నృత్య పోటీలలో విద్యార్థుల జయకేతనం
- జమ్మికుంట ప్రఖ్యాతి నిలబెడుతున్న స్టూడియో




**వేద న్యూస్ , జమ్మికుంట:**

కరీంనగర్‌లోని రెయిన్ స్టార్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీలలో జమ్మికుంటకు చెందిన ప్రసంగి డాన్స్ స్టూడియో, ఫిట్‌నెస్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చాటుతూ.. విశేష విజయాలు సాధించారు. జూనియర్ డ్యూయెట్ విభాగంలో ప్రకృతి, రసజ్ఞ ప్రథమ స్థానం పొందగా, జూనియర్ ఫోక్ సోలో విభాగంలో ప్రకృతి ప్రథమ స్థానం సాధించింది. జూనియర్ వెస్ట్రన్ సోలో విభాగంలో రసజ్ఞ తృతీయ బహుమతి అందుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ ,మేజిస్ట్రేట్ పమేలా సత్పతి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మహేశ్వర్ , అలాగే ప్రత్యేక అతిథిగా జబర్దస్త్ టీమ్‌కు చెందిన జీవన్ హాజరై విద్యార్థులను అభినందించారు.న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన సర్వేష్ , ఉమా మహేశ్వర్ , నక్క అశోక్ మాట్లాడుతూ..“జమ్మికుంట పేరు ప్రతిష్టలను నిలబెట్టారు. మీరు ఎక్కడికి వెళ్లినా విజయాలు మీ సొంతం అవుతాయి” అని ప్రశంసించారు.ప్రసంగి డాన్స్ స్టూడియో, ఫిట్‌నెస్ సెంటర్ డైరెక్టర్ శ్రీలత మాట్లాడుతూ.. విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. జమ్మికుంటలో స్థాపించిన ఈ సంస్థ ద్వారా అనేక మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులను చేర్పించి, ఉన్నత స్థాయికి తీర్చిదిద్దేందుకు తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాస్టర్ ప్రసంగి, మాస్టర్ రాజు(రాజేష్)ని ఘనంగా సన్మానించారు. ఏప్రిల్ 1 నుంచి సమ్మర్ క్యాంప్ ఉంటుందని, జమ్మికుంట పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలను చదువు తో పాటు వారికి ఇష్టమైన నృత్యం, డ్యాన్స్ ఇత రా లలో ప్రోత్సహించాలని ప్రసంగి డ్యాన్స్ స్టూడియో ప్రొప్రైటర్ శ్రీలత తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆటోనమస్ హోదా

- విద్యాభివృద్ధికి మైలురాయి
- అదనపు ఎస్పీ మహేందర్



**వేద న్యూస్, మెదక్:**

మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి స్వయంప్రతిపత్తి (ఆటోనమస్) హోదా లభించడం పట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్ నాయకత్వంలో అధ్యాపక బృందం అదనపు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆటోనమస్ హోదా సాధించడం జిల్లాలో ఉన్నత విద్యాభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. యూజీసీ ప్రమాణాలకు అనుగుణంగా విద్యా నాణ్యత, పరిశోధన రంగాల్లో సాధించిన పురోగతికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. స్వయంప్రతిపత్తి హోదాతో కళాశాలకు పాఠ్యాంశాల రూపకల్పన, నూతన కోర్సుల ప్రవేశం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలులో మరింత స్వేచ్ఛ లభిస్తుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో అధ్యాపకుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. తిరుమలరెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. శరత్ రెడ్డి, సిఎస్ఆర్ ఫండ్ కోఆర్డినేటర్ డా. నాగేందర్ రావు, గణిత శాస్త్ర విభాగాధిపతి పి. వెంకటేశ్వర్లు తదితర అధ్యాపకులను అదనపు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు

# పంతులుపల్లి పాఠశాల తనిఖీ





**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి మండలం నాగరాజు పల్లి పరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలను నల్లబెల్లి కాంప్లెక్స్ హెచ్ ఎం అంబి వసంత సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల విద్య బోధనను పరిశీలించారు. విద్యార్థుల యొక్క విద్యా సామర్థ్యాలను, ఎఫ్ ఎల్ ఎన్ బోధనను, పాఠ్యపుస్తక బోధన, వర్క్ బుక్ నిర్వహణ, పీ టీ ఎమ్ నిర్వహణ రిజిస్టర్, ఎండిఎం నిర్వహణ, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెడుతున్నారా లేదా.. అనే విషయాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు తగిన సలహాలు ఇచ్చారు. ఎఫ్ ఎల్ ఎన్ శాంపిల్ సర్వే జరుగనున్న నేపథ్యంలో విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అలాగే ఎఫ్ ఎల్ ఎన్ లో మంచి ఫలితాలు సాధించేలా మూడో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. పాఠశాల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్ణకంటి రామ్మూర్తి పాల్గొన్నారు.

# రుద్రూర్‌లో పోలీసు కవాతు

- శాంతి భద్రతల పరిరక్షణకు పికెటింగ్ ఏర్పాటు



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో ఆదివారం ఓ మహిళా న్యాయవాది పై దాడి జరిగిన ఘటన ఉద్రిక్తతకు దారి తీసింది. ఓ వర్గానికి చెందిన వ్యక్తులు మరో వర్గంపై దాడి చేయగా, ఆ ఘటనను ప్రశ్నించిన మహిళా న్యాయవాదిపై కూడా దాడి జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తారాస్థాయికి చేరడంతో బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం పరిస్థితులను సమీక్షించేందుకు జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య రుద్రూర్ గ్రామాన్ని సందర్శించారు. ఇరువర్గాల మధ్య జరిగిన ఘటనపై కాలనీవాసుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో మరే అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించారు. సీపీ వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఎస్సై సాయన్నతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

- బంజారా సమాజానికి మార్గదర్శకుడు
- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**వేదన్యూస్, దామరచర్ల:**

అల్ ఇండియా బంజారా సేవా సంఘం మిర్యాలగూడ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుంచి బంజారా భవన్ వరకు ఉత్సవ ర్యాలీ నిర్వహించి, అనంతరం భోగ్ బండార్, ప్రత్యేక పూజలు చేశారు. మినీ రవీంద్ర భారతి లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గోర్ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శకుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. 18వ శతాబ్దంలోనే బంజారా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆయన కృషి చేశారని, అహింస, ధర్మం, క్రమశిక్షణను బోధించారని తెలిపారు. మూఢనమ్మకాలు, మతమార్పిడులను వ్యతిరేకించిన మహానుభావుడని పేర్కొన్నారు. సేవాలాల్ మహారాజ్ తండాల అభివృద్ధి, విద్య, స్త్రీ గౌరవానికి ప్రాధాన్యతనిచ్చారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. గిరిజనుల ప్రేమాభిమానాలతోనే తాను ఎమ్మెల్యేగా నిలిచానని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వంలో గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోందని, గిరిజన నాయకుడు శంకర్ నాయక్‌కు ఎమ్మెల్సీతో పాటు పార్టీ పదవి ఇవ్వడం దానికి నిదర్శనమని తెలిపారు. అనంతరం గిరిజన నాయకులు, కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధాబాలు, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా న్యాయవాదిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

- పోలీస్ స్టేషన్ ఎదుట న్యాయవాదుల ధర్నా




**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో ఆదివారం జరిగిన ఘటనపై న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వ్యక్తిపై నలుగురు వ్యక్తులు దాడి చేస్తుండగా ఆ ఘటనను గమనించిన మహిళా న్యాయవాది దాడిని ప్రశ్నించగా, ఆమె న్యాయవాది అని తెలిసినా మరో వర్గానికి చెందిన వ్యక్తులు అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ ఆమెపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనను నిరసిస్తూ సోమవారం రుద్రూర్ పోలీస్ స్టేషన్ ఎదుట న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా న్యాయవాదిపై దాడి జరగడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, కేసు నమోదు విషయంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. ఫిర్యాదులో ఉన్న కొన్ని అంశాలను తొలగించి, ఇతర పదాలు జోడించి కోర్టుకు పంపినట్లు తెలిపారు. మహిళకు న్యాయం జరగాల్సిన సమయంలో పోలీసులు నిందితులకు సహకరిస్తున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. నిందితులపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లు నమోదు చేసి, వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపాలని డిమాండ్ చేశారు. మహిళా న్యాయవాదికి న్యాయం జరగకపోతే బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సీఐ కృష్ణ, ఎస్సై సాయన్న న్యాయవాదులతో మాట్లాడి, కేసులో నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# టీజీ ఎడ్‌సెట్–2026 షెడ్యూల్ విడుదల




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2026 విద్యా సంవత్సరానికి బి.ఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న టీజీ ఎడ్‌సెట్–2026 పూర్తి షెడ్యూల్‌ను కాకతీయ విశ్వవిద్యాలయం సోమవారం విడుదల చేసింది. వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధికారికంగా షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 20న నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఓసీ/బీసీ అభ్యర్థులు రూ.750, ఎస్సీ/ఎస్టీ/పిహెచ్‌సీ అభ్యర్థులు రూ.550 పరీక్షా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల సమర్పణకు ఏప్రిల్ 15 చివరి తేదీగా నిర్ణయించగా, రూ.250 లేట్ ఫీజుతో ఏప్రిల్ 22 వరకు, మరోసారి రూ.250 లేట్ ఫీజుతో ఏప్రిల్ 27 వరకు, రూ.1000 లేట్ ఫీజుతో ఏప్రిల్ 30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మే 2 నుంచి దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుందని, మే 4న పరీక్షా కేంద్రాల కేటాయింపు జరుగుతుందని చెప్పారు. రూ.5000 లేట్ ఫీజుతో మే 8, 9 తేదీలలో ప్రత్యేక అవకాశం కల్పించనున్నారు. హాల్ టికెట్లు మే 9 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష మే 12న ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు రెండు సెషన్లలో నిర్వహించబడుతుందని వివరించారు. మే 15న ప్రాథమిక కీ విడుదల చేసి, మే 17 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, తుది ఫలితాలు మే 30న వెల్లడిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా టి.జి ఎడ్‌సెట్2026 అధికారిక వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య బి. వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 16 నగరాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌ను నాలుగు జోన్లుగా విభజించడంతో పాటు నల్గొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, సిద్దిపేట్ తదితర నగరాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఎడ్యుకేషన్ డీన్ ఆచార్య ఎన్. రాంనాథ్ కిషన్, ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రజకులపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలి

- రజక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేపల్లి రాజు (మైఖేల్)



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మెర శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలలో రెండు నెలల బాలికను బలి తీసుకున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని రజక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేపల్లి రాజు (మైకెల్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పాత్రికేయ మిత్రులతో మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలకు పాల్పడిన నిందితులపై హత్య కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని రజక కుటుంబం పై దాడి చేసి రెండు నెలల చిన్నారని బలిగొన్న ఉపేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, తుకారం రెడ్డి, సతీష్ రెడ్డి లను కఠినంగా శిక్షించాలని రజక కులానికి చెందిన చంద్రకళ కుటుంబం శ్రీ మల్లికార్జున స్వామి దర్శనం చేసుకుని వెళ్ళగా దర్శనం చేసుకోకుండా నిర్వాహకులు చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకోగా ఎందుకు అడ్డుకుంటున్నారని అడిగిన చంద్రకళ కుటుంబాన్ని బూతులు తిడుతూ దుర్భాషలాడుతూ అతి కిరాతంగా క్రూరంగా చిన్నారిని కాలుతో తన్నిన దుర్మార్గులను సాంఘిక బహిష్కరణ చేయాలని కోరారు. నిందితులపై కేసు నమోదు చేయకుండా పక్షపాత ధోరణి అవలంబిస్తున్న అక్కడి పోలీసు అధికారులను శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని ముఖ్యంగా సీఐ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 24, 2026

# ర్యాష్, మైనర్ డ్రైవింగ్‌పై పోలీసుల ప్రత్యేక దృష్టి



**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి :**

త్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ మరియు మైనర్ డ్రైవింగ్ చేయటం నిషేధమని, మైనర్ వాహనం నడిపి పట్టుబడిన సందర్భాల్లో వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేయబడుతుందని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ హెచ్చరించారు. వాహన యజమానులు మైనర్ వ్యక్తులకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్ వాహనం నడిపినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ ప్రమాదాలు వాహన యజమానితో పాటు ఇతర వ్యక్తులకు కూడా నష్టం కలిగించే అవకాశముందని, కాబట్టి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఎస్పీ సూచించారు. అలాగే, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడపడం, నంబర్ ప్లేట్ దాచడం లేదా తప్పుడు నంబర్లు ఏర్పాటు చేయడం, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా శబ్ద కాలుష్యాన్ని సృష్టించే విధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను కలిగి ఉన్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొందరు వాహనదారులు నంబర్ గుర్తించలేని ఫ్యాన్సీ డిజైన్ లేదా తప్పుడు నంబర్లు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా అన్ని వాహనాల నంబర్ ప్లేట్లను నిబంధనలకు అనుగుణంగా సరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా, రాంగ్ సైడ్ పార్కింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, బాధ్యతారాహిత్యంగా ఓవర్ లోడెడ్ వాహనాలు నడపడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు మరియు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలి, ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాల న్నారు. ప్రజ భద్రత కొరకు జిల్లా వ్యాప్తంగా నిరంతర తనిఖీలు చేపడతామని తెలిపారు.

# పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

**- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్**

**వేద న్యూస్, ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి:**




ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించాలని ఎస్టీయూ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎస్టీయూ భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ అమలు చేయాలని, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అర్హత మార్కులను తగ్గించాలని కోరారు. టెట్ పరీక్షలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు అదనపు వెయిటేజీ మార్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ ఎరియర్స్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. నగదు రహిత వైద్య చికిత్సలను అందిస్తూ ఈహెచ్‌ఎస్‌ను పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, విద్యా సంబంధేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చి పని ఒత్తిడిని తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన సంక్షేమ శాఖలో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.

# కేయూ వీసీని మర్యాదపూర్వకంగా కలిసిన ఆచార్య దయాకర్

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగానికి చెందిన విశ్రాంత ఆచార్యులు గాదె దయాకర్ తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ అప్పెలేట్ అథారిటీ సభ్యునిగా ఇటీవల నియమితులైన సందర్భంగా, సోమవారం కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధనావకాశాల విస్తరణ తదితర అకాడమిక్ అంశాలపై పరస్పర చర్చలు జరిగాయి. ఆచార్య గాదె దయాకర్ నియామకాన్ని అభినందించిన వీసీ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం కలిసి శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. విశ్వవిద్యాలయానికి గౌరవం తీసుకువచ్చిన ఈ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్రానికి ఆయన సేవలు మరింత మేలు చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆచార్య దయాకర్‌ను అభినందించారు.

# అలరించిన చిత్రకళా ప్రదర్శన

**- తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొన్న 436 మంది చిన్నారులు**

**వేద న్యూస్, హనుమకొండ**



సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన సాగంటీస్ ఆర్ట్ ఛాలెంజ్ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 436 మంది చిన్నారులు పాల్గొన్నారు. వారంరోజులుగా రూపొందించిన చిత్రాలు, క్రాఫ్ట్ వర్క్‌లను ఒకే చోట ప్రదర్శిస్తూ "చిన్నారుల చిత్రకళా సంత" పేరిట ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. శనివారం వేములవాడ ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కరీంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మంకమ్మ తోట)లో, ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ళ వేణుమాధవ్ ఆడిటోరియంలో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కళాభిమానులు, ప్రముఖులు వందల సంఖ్యలో హాజరై చిత్రాలను తిలకించారు. చిన్నారుల ప్రతిభకు పెద్దలు ప్రశంసలు కురిపించగా, పిల్లల్లో ఆనందం వెల్లివిరిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ప్రదర్శన అనంతరం అకాడమీ డైరెక్టర్ డా. మంజుల సాగంటి పాల్గొన్న ప్రతి చిన్నారి ఆర్టిస్టును కండువాతో సన్మానించి, సర్టిఫికెట్, ట్రోఫీ, గోల్డ్ మెడల్ అందజేశారు. పిల్లల్లో సృజనాత్మకత, ఏకాగ్రత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని వీక్షకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు చిప్పకుర్తి శ్రీనివాస్, నిమ్మల శ్రీనివాస్, హరిప్రసాద్ రావు, హరిప్రియ, శిరీష, దేవిక, జయశ్రీ, రఘుపతి, హేమలత, కవిత తదితరులు పాల్గొన్నారు. చివరగా డా. మంజుల సాగంటి హాజరైన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# సమానత్వాన్ని సమాజంలో ప్రతిష్ఠించిన దార్శనికుడు సేవాలాల్

**- కేయూ వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి**

**- ఘనంగా బంజారాల ఆరాధ్య దైవం జయంతి**

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం ప్రాంగణంలో సోమవారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి, మహాభోగ్ భండారో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ/ఎస్టీ సెల్ సంచాలకులు డాక్టర్ ఎ. రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కేయూ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ అత్యంత పూజనీయులు, బంజారా–గిరిజన సమాజాల ఆరాధ్య దైవమని కొనియాడారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుచూపుతో పనిచేసిన మహనీయుడని అభివర్ణించారు. సమానత్వం, న్యాయం, సేవాభావం వంటి విలువలను సమాజంలో ప్రతిష్ఠించిన దార్శనికుడని పేర్కొన్నారు. కేయూ విశ్రాంత ఆచార్యులు, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆచార్య ఎ. సీతారాం నాయక్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. బంజారా లిపి, చరిత్రలను ప్రాచుర్యంలోకి తీసుకురావాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య గొనా నాయక్ మాట్లాడుతూ, సేవాలాల్ మహారాజ్ బోధనలు సామాజిక ఐక్యతకు మార్గదర్శకమని అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే సమాజ పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ ఎన్. సుదర్శన్, క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ తదితరులు పాల్గొన్నారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పోచారం భూమి పూజ

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండలంలోని అంబం (ఆర్) గ్రామంలో పలు అభివృద్ధి పనులకు సోమవారం బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ చేశారు. మొత్తం రూ.1.49 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన నిర్వహించారు. గ్రామ మోడల్ స్కూల్, కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.50 లక్షలు, మెయిన్ రోడ్డు నుండి మోడల్ స్కూల్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.21 లక్షలు, గర్ల్స్ హాస్టల్ మరమ్మత్తులకు రూ.33 లక్షలు, సంస్కార్ ప్రహరీ నిర్మాణానికి రూ.45 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. నూతన పంచాయతీ పాలకవర్గం ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద మొత్తంలో నిధులు మోడల్ స్కూల్‌కు రావడం పట్ల గ్రామ ప్రజలు, పాలకవర్గం సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుర్లెపు గంగాధర్, ఉప సర్పంచ్ రేపల్లి సాయిప్రసాద్, వార్డు సభ్యులు, మోడల్ స్కూల్ చైర్మన్ పావని నరేష్, తహసీల్దార్ తారబాయి, ఎంపిడిఓ బాల గంగాధర్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మెర ఘటనలో నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలి



**- బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించాలి**

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**

**వేదన్యూస్, దామరచర్ల:**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన ఘటనలో నిందితులపై హత్య కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ కమిషన్ కార్యాలయంలో బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాష్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ.. కుమ్మెర గ్రామంలోని మల్లన్న గుడిలోకి ప్రవేశించిన నేపథ్యంలో చాకలి కులానికి చెందిన గణేష్, చంద్రకళ, మౌనికలపై గ్రామ సర్పంచ్ తుకారం రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు అమానుషంగా దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో రెండు నెలల పసికందు మృతి చెందడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని హత్య కేసు నమోదు చేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మ, బీసీ యువజన సంఘం కార్యాలయ అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రామలింగేశ్వర స్వామి దేవస్థానం భూముల కౌలు వేలం ముగింపు

**- టెంకాయ వేలాన్ని దక్కించుకున్న నార్ల అజయ్**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం భూముల కౌలు వేలంపాట సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం ఆరు మంది రైతులు దేవాలయ భూముల కౌలు హక్కులను పొందారు. సర్వే నం.48లోని 5 ఎకరాలు 2 గుంటల భూమిని సలికొలిమిలా బిక్షమాచారి రూ.1,75,000కు దక్కించుకున్నారు. సర్వే నం.108లో 3 ఎకరాలు 9 గుంటలను భయ్యా సైదులు రూ.72వేలకు, సర్వే నం.766లో 4 ఎకరాలు 8 గుంటలను దామెర్ల అంజయ్య రూ.94వేలకు కౌలు తీసుకున్నారు. సర్వే నం.300లో 2 ఎకరాలు 20 గుంటలను కొల మిన్నయ్య రూ.28వేలకు, సర్వే నం.290లో 1 ఎకరం 21 గుంటలను కొల పెద్ద సైదులు రూ.25వేలకు, సర్వే నం.289లో 1 ఎకరం 31 గుంటలను కొల నరసయ్య రూ.45వేలకు దక్కించుకున్నారు. సర్వే నం.49లోని 15 ఎకరాలు 22 గుంటల భూమిని స్థానిక రైతుల విజ్ఞప్తి మేరకు ఐకెపి కేంద్రానికి కేటాయిస్తున్నట్లు దేవాలయ ఇంచార్జి మేనేజర్ కొంకపాక మృత్యుంజయ శాస్త్రి తెలిపారు. అలాగే దేవాలయ టెంకాయ వేలాన్ని నార్ల అజయ్ రూ.37,500కు దక్కించుకున్నారు. వేలంపాట ప్రశాంతంగా ముగిసిందని, కౌలు పొందిన రైతులు 24 గంటల్లోగా నగదు లేదా చెక్కు రూపంలో మొత్తాన్ని చెల్లించాలని మేనేజర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పిల్లల సందీప్, ఎలికంటి భరత్, దేవాలయ చైర్మన్ బ్రహ్మదేవర విద్యాసాగర్, ఉప సర్పంచ్ శాలెం రాజు, దేవాలయ అధికారులు, అర్చకులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# మహోన్నతుల జీవితాలు ఆదర్శప్రాయం



**- విశ్రాంత ప్రిన్సిపాల్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

**వేద న్యూస్, మందమర్రి:**

మహోన్నత వ్యక్తుల జీవితాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో లీడ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. భారతీయుల ఆలోచనా శక్తి, ఆధ్యాత్మికతను ప్రపంచానికి పరిచయం చేసిన అబ్దుల్ కలాం, స్వామి వివేకానంద వంటి మహనీయులు యువతకు స్ఫూర్తి ప్రదాతలని పేర్కొన్నారు. ప్రతిభ, ధైర్యసాహసాలతో విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన వారు దేశానికి మార్గదర్శకులుగా నిలిచారని అన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో పాఠశాల విద్యే పునాది అని, ఈ దశలో విద్యతో పాటు వివేకం, సంస్కారం, సాంకేతిక నైపుణ్యాలు, ఆకర్షణీయమైన వ్యక్తిత్వ వికాసం అవసరమని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ మాట్లాడుతూ, నేటి యువత విద్యతో పాటు వినయాన్ని అలవర్చుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. చదువుతో ఉన్నత స్థాయికి చేరి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారీ నిరసన

- రజక కుటుంబంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి
- రజక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మటూరి సాయికృష్ణ డిమాండ్
- కరీంనగర్,వరంగల్ రహదారిపై కిలోమీటర్ మేర నిలిచిపోయిన వాప



**వేద న్యూస్, హుజూరాబాద్:**

నాగర్ కర్నూల్ మండలం కుమ్మెర మల్లన్న జాతరలో రజక కుటుంబంపై అమానుషంగా దాడి చేసి, రెండు నెలల పసికందు మృతికి కారణమైన అగ్రకుల అహంకారులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రజక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మటూరి సాయికృష్ణ రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొలీపక సారయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ జిల్లాహుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రజక మహిళలతో కలిసి వారు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు.

**అమానుష దాడిని ఖండిస్తూ..**

ఈ సందర్భంగా సాయికృష్ణ, సారయ్యలు ప్రజా సంఘాల నాయకులుమాట్లాడుతూ, మల్లన్న దర్శనం కోసం వెళ్లిన చాకలి చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకోవడం సభ్య సమాజం తలదించుకోవాల్సిన విషయమని మండిపడ్డారు. కులం పేరుతో దూషిస్తూ, ఆలయంలోకి ప్రవేశం లేకుండా అడ్డుకోవడమే కాకుండా, ఎదురు తిరిగినందుకు కుటుంబ సభ్యులపై విచక్షణారహితంగా దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. ఈ దాడిలోనే రెండు నెలల పసికందు మరణించడం అత్యంత విషాదకరమని, దీనికి బాధ్యులైన వారిపై హత్య కేసు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

**పోలీసుల తీరుపై ఆగ్రహం:**

బాధిత కుటుంబం ఫిర్యాదు చేయడానికి వెళ్తే, కనీసం కేసు నమోదు చేయకుండా వారిని వేధించిన పోలీసుల తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించి, నిందితులకు కొమ్ముకాసిన పోలీసు అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు నిందితులు జైలుకు వెళ్లే వరకు రజక సమాజం పోరాటాన్ని ఆపదని వారు హెచ్చరించారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా యావత్తు రజక లోకం ఏకమై బాధిత కుటుంబానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు నల్ల బాలరాజ్, బోరింగ్ వెంకట్రాజ్యం, కొలిపాక బిజెపిశ్రీనివాస్, కొలిపాక రమేష్, గోపు వెంకటేశ్వర్లు. కొలీపాక శ్రీనివాస్, కొండపాక పవన్, నల్ల సుమన్, సుంకరి మొగిలి, కొండపాక లక్ష్మి, నిమ్మటూరి రమ, వసంత, భూలక్ష్మి, స్వరూప, కొలిపాక రంగయ్య, ప్రజా సంఘాల నాయకులు వేల్పుల ప్రభాకర్, తులసి లక్ష్మణమూర్తి, చిలకమర్రిశ్రీనివాస్, సాదుల రవీందర్, ఇప్పకాయల సాగర్ తో పాటు తదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# మా కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదు

## - ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

బిఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ కాంగ్రెస్ కార్యకర్తపై జరిగిన దాడి ఘటనపై వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలతో వరంగల్ పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికారం కోల్పోయినా కొంతమంది ప్రతిపక్ష నేతలు ఇంకా గుండాల మాదిరిగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఉద్యమ కాలంలో అధికారులపై దాడులకు పాల్పడిన నాయకత్వం ఇప్పటికీ అదే స్వభావంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. బి ఆర్ ఎస్ కార్పొరేటర్ మా కాంగ్రెస్ కార్యకర్తపై దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. గతంలో తోట పవన్‌పై జరిగిన దాడిని కూడా గుర్తుచేస్తూ, ఇది ఒంటరి ఘటన కాదని, క్రమపద్ధతిలో జరుగుతున్న దాడుల శ్రేణిలో భాగమని అన్నారు. నిన్నటి ముఖ్యమంత్రి పర్యటనపై అవాకులు చెవాకులు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. మా ప్రభుత్వం ప్రజల పక్షాన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి సందర్భంలో ఓపిక పాటించాలని సూచిస్తున్నప్పటికీ, ఆ సహనాన్ని ప్రతిపక్షాలు బలహీనతగా భావిస్తున్నాయని నాయిని వ్యాఖ్యానించారు. ఇకపై కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతలు కులం, ప్రాంతం పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర పోలీస్ శాఖ ఈ విషయంపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిన్నటి ఘటనలో మా కార్యకర్త ప్రాణాపాయం జరిగి ఉంటే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. వినయ్ భాస్కర్‌పై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, రాజకీయ లాభాల కోసం జిల్లాను ముక్కలు చేశారని ఆరోపించారు. గతంలో భద్రఖాళి ఆలయ పరిసరాల్లో గుడిసెల తొలగింపుపై తీర్మానం చేసింది అదే నాయకత్వమని, ఇప్పుడు అమ్మవారి పేరుతో రాజకీయాలు చేయడం ద్వంద్వ వైఖరని పేర్కొన్నారు. భద్రఖాళి అంశాన్ని ప్రస్తావిస్తూ, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడం ఆపాలని సూచించారు. ప్రశాంత నగరాన్ని అస్థిరపరిచేలా వ్యవహరిస్తే పిడి యాక్ట్ కింద కేసు నమోదు చేసి నగర బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన అనేక హింసాత్మక ఘటనలకు కూడా అదే నాయకత్వం ప్రోత్సాహం ఇచ్చిందని ఆరోపించారు. పదేళ్ల అధికార కాలంలో కాలనీ, డివిజన్ స్థాయి సమస్యలపై దృష్టి సారించని వారు ఇప్పుడు ప్రజా ప్రయోజనాల పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అక్రమ సంపాదనలతో రాజకీయాలు చేయడం ఆపాలని హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పటికీ మా సహనం బలహీనత కాదని, అభివృద్ధి మా సిద్ధాంతమని, కక్షపూరిత రాజకీయాలు మా స్వభావం కాదని స్పష్టం చేశారు. కార్యకర్తల రక్షణ విషయంలో రాజీ పడేది లేదని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుమ్మెర జాతరలో దాడి.. పసికందు మృతి

## - నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్




**వేద న్యూస్, నల్లబెల్లి:**

నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దాడి ఘటనలో రెండు నెలల పసికందు మృతి చెందిన ఘటనపై మండల కన్వీనర్ వైనాల వీరస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లబెల్లి గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జాతరలో భక్తుల నుంచి వంద రూపాయలు వసూలు చేస్తూ రశీదులు ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించిన కీర్తి, ఆమె తల్లి చంద్రకళ, గణేష్‌లపై దాడి చేయడం అమానుషమని అన్నారు. గణేష్‌ను కొబ్బరికాయల గదిలో బంధించి కొట్టారని, ఘటనలో రెండు నెలల పసికందు మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. పసికందు మరణానికి కారణమైన వారిపై హత్యానేరం నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు కలిసి ఉధృత ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

## - ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి - సీఐ రేణుక రెడ్డి



**వేద న్యూస్, అల్లాదుర్గం:**

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని.. హైవేపై ప్రయాణించే వాహనదారులు లైన్ డిసిప్లిన్ పాటించాలని సీఐ రేణుక పేర్కొన్నారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల కేంద్రంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ హైవే-161పై సెకండ్ ఫేజ్ అండ్ అలైవ్ కార్యక్రమం ఎస్సై శంకర్ సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐ రేణుక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు సూచనలు చేశారు. 40, 60, 80 కిలోమీటర్ల వేగ పరిమితులకు అనుగుణంగా ఆయా లైన్లలోనే ప్రయాణించాలన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్లే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రాణనష్టం నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

# మహిళా న్యాయవాదికి బీజేపీ మద్దతు



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో ఇటీవల ఓ మహిళా న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ బీజేపీ నాయకులు మహిళా న్యాయవాదికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, దొరబాబు మాట్లాడుతూ, మహిళా న్యాయవాదిపై దాడి జరిగిన ప్పటికీ పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళను పరామర్శించేందుకు జిల్లా అధ్యక్షుడు దినేష్ కులకర్ణి రానున్నారని, అయితే ఆయనను పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. రెండు రోజుల తర్వాత అయినా జిల్లా అధ్యక్షుడు రుద్రూర్‌కు వచ్చి మహిళా న్యాయవాదిని పరామర్శిస్తారని తెలిపారు. బాధితురాలికి న్యాయం జరగని పక్షంలో పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, నాయకులు పార్వతి మురళి, కటికే రామ్ రాజ్, అనిల్, కుమ్మరి గణేష్, వడ్ల సాయినాథ్, హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సామిణి మృతికి యువజన కాంగ్రెస్ నివాళి



**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండల పరిధిలోని భాగ్యనగర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల సామ్యతండాకు చెందిన భూక్యా సామిణి సోమవారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హచ్చు (హర్ష నాయక్) వెంటనే వారి నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామిణి మరణం ఆ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బానోత్ రాందాస్ నాయక్ (మండల సీనియర్ నాయకులు), హరిదాస్, సాయి, గణేష్ తదితరులు, తండా వాసులు మరియు మృతురాలి బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

# బహుజన సంక్షేమ, రజక సంఘాల ఆధ్వర్యంలో నిరసన



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలోని వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద రజక సంఘం, బహుజన సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లా కమ్మెర గ్రామంలో రజక సామాజి క వర్గానికి చెందిన కుటుంబంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు జాలిగాపు అశోక్ మాట్లాడుతూ, దేవాలయ దర్శనం కోసం వెళ్లిన కుటుంబాన్ని అడ్డుకుని టోకెన్ విషయమై వాగ్వాదం జరిగిందని, అనంతరం దాడికి పాల్పడి కుటుంబ సభ్యులను చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. ఈ ఘటనలో రెండు నెలల పసికందు మృతి చెందడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ సరైన చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ, దాడికి పాల్పడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భారీ ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసనకు బహుజన సంక్షేమ సంఘం, అంబేద్కర్ విద్యార్థి సమాఖ్య మద్దతు ప్రకటించాయి. కార్యక్రమంలో మారపల్లి క్రాంతికుమార్, రాయరాకుల మొగిలి, మొగం సుమన్, నాగుల పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# భట్టి విక్రమార్క కుమారుడి వివాహానికి ఆహ్వానం



**వేద న్యూస్, కారేపల్లి:**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం మార్చి 5న హైదరాబాద్‌లో జరగనుంది. ఈ సందర్భంగా శుభలేఖల పంపిణీ కార్యక్రమం మండలంలో నిర్వహించారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హచ్చు (హర్ష నాయక్)ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాటి నరసయ్య, షర్టు వీరభద్రం మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆహ్వానం స్వీకరించిన హర్ష నాయక్ ఉప ముఖ్యమంత్రి కుటుంబానికి శుభాకాంక్షలు తెలియ జేస్తూ, వివాహం వైభవంగా జరగాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో గుగులోత్ రాజేష్ నాయక్, గుగులోత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వార్డు సభ్యుల పాత్ర కీలకం

## - మండల పంచాయతీ అధికారి రవి



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి పసరగొండ రవి మాట్లాడుతూ, గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం2018 ప్రకారం సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలను వివరించారు. గ్రామపంచాయతీ సమావేశాలు, గ్రామసభల నిర్వహణ, ఆర్థిక వనరుల సక్రమ వినియోగం, పారిశుధ్యం, పచ్చదనం పెంపు, వీధి లైట్ల నిర్వహణ వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. గ్రామ వనరులను సమర్థవంతంగా ఉపయోగించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి సాధించాలన్నారు.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 24, 2026

# ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



**వేద న్యూస్, శాయంపేట:**

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ మిషన్ ఆన్ న్యాచురల్ ఫార్మింగ్ పథకంలో భాగంగా శాయం పేట మండలం కొత్తగట్టు సింగారం గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి డి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులు తమ భూమిలో కనీసం కొంత భాగంలో అయినా రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా సహజ పద్ధతుల్లో పంటలు పండించాలని సూచించారు. స్థానిక గోమయం, గోమూత్రం వినియోగం, జీవామృతం, ఘనజీవామృతం, బీజామృతం వాడకం, మల్చింగ్ ద్వారా నేలతడి పరిరక్షణ, మిశ్రమ మరియు అంతర పంటల సాగు వంటి విధానాలు ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యమని వివరించారు. రసాయనాల అధిక వినియోగం వల్ల మానవ ఆరోగ్యంపై ప్రభావం పడటంతో పాటు నేల సారవంతత క్షీణిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బి. రాకేష్, పంచాయతీ కార్యదర్శి నాగశ్రీ, ఉపసర్పంచ్ కొత్తగట్టు సాయి మరియు రైతులు పాల్గొన్నారు.

# కేయూ పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఫిబ్రవరి 25, 26 తేదీలలో నిర్వహించాల్సిన పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల తెలిపారు. వాయిదా పడిన పరీక్షల్లో నాన్ ప్రొఫెషనల్ కోర్సులు (ఎం.ఏ., ఎం.ఎస్సి., ఎం.కామ్.)తో పాటు ప్రొఫెషనల్ కోర్సులు (ఎంబీఏ, ఎంసీఏ) కూడా ఉన్నాయి. కొత్త పరీక్ష తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని, కళాశాల యాజమాన్యాలు మరియు విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

# న్యాయ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం




**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి కేజీబీవీ పాఠశాలలో జిల్లా న్యాయ సేవా విభాగం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి. సాంబయ్య, ఎం. రమేష్, ఎస్కే రహిముద్దీన్, టి. సునీత, కె. ప్రతిభ పాల్గొన్నారు. విద్యార్థులకు బాల్య వివాహాల నిషేధం, బాల కార్మికుల చట్టం, వరకట్న వేధింపులు, పోక్సో చట్టం వంటి ముఖ్య అంశాలపై వివరించారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారిస్తూ క్రమశిక్షణతో చదివి రాబోయే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ప్రేరేపించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఘనంగా సంతు గాడ్గే బాబా జయంతి



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో సంతు గాడ్గే బాబా 151వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు ర్యాగల్ల అంజయ్య ఆధ్వర్యం లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు సంతు గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సమాజంలో శుభ్రత, సమానత్వం, సేవా భావం పెంపొందించడంలో ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, స్వామి కుమార్, మొండయ్య, రాజశేఖర్, వినోద్, శ్రీనివాస్, వెంకటేష్, రాజు, సాయి, మల్లేశం, జాన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

- విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి
- బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. బోయినిపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, మోడల్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షిస్తూ పెన్నులు, స్కేలు, పెన్సిళ్లు, ఎగ్జామ్ ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ ప్రేరణతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని జెడ్పీహెచ్ఎస్, కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూల్‌లలో చదువుతున్న ప్రతి పదో తరగతి విద్యార్థికి పరీక్షా సామగ్రి అందించాలనే ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో కీలక మలుపు అని తెలిపారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో పరీక్షల కు సిద్ధమై ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. చదువు కేవలం మార్కుల కోసం మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్ నిర్మాణానికి పునాది కావాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి కుటుంబాలకు, గ్రామాలకు, పాఠశాలలకు, మండలానికి గౌరవం తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, స్తంభంపెల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, సీనియర్ నాయకులు సుంకపాక ప్రభు, మెరుపుల గంగాధర్, ఇల్లందుల బాలయ్య, సారంపల్లి రాజు, జనగాం లక్ష్మణ్, మినుములు శ్రీనివాస్, పెంచాలా మహేష్, స్వామి కుమార్, కిరణ్, గంగాధర్ చారి, ముసుకు విజయేందర్ రెడ్డి, రజనీకాంత్, నిఖిల్, వినయ్, రాచర్ల రాజేశం, కల్యాణ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ కన్నీటి వీడ్కోలు



**వేద న్యూస్, కారేపల్లి:**

భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని సామ్యతండాకు చెందిన భూక్యా సామిని హఠాన్మరణం చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతివార్త తెలుసుకున్న వెంటనే గ్రామ సర్పంచ్ బానోత్ హీరాలాల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న సర్పంచ్ హీరాలాల్ గ్రామ పెద్దలతో కలిసి మృతురాలి నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, సామిని అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తి అని, ఆమె మరణం కుటుంబానికే కాక తండాకు తీరని లోటని పేర్కొన్నారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అంతిమ నివాళుల కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుగులోత్ బిక్కులాల్, బానోత్ రామచందర్, రాందాస్, గుగులోత్ భీముడు నాయక్, వాంకుడోత్ గాంధీతో పాటు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పీహెచ్సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ప్రదీప్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, వైద్య సేవల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఫీల్డ్ సిబ్బంది, హెడ్‌క్వార్టర్ సిబ్బందితో సమావేశమై సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచిం చారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాల అమలు, నిర్దేశిత లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి కృష్ణ, పీడీఎంఓ వైద్యులు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# గ్రామాల్లో జాజిరి హోరు

- పల్లెల్లో చిన్నారుల సందడి షురూ
- సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక



**వేద న్యూస్, నల్లబెల్లి:**

కాముని పున్నం సమీపిస్తున్న వేళ గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. హోలీ పండుగకు తొమ్మిది రోజుల ముందు నుంచి ఆడే జాజిరి ఆట గ్రామాల్లో సందడి గా కనిపిస్తోంది. 'మామా నాకు పిల్లనిచ్చే.. పిల్ల పేరు మల్లెమొగ్గ.. నా పేరు జమిందార్.. జాజిరి ఆటకు వేళయింది' అంటూ చిన్నా, పెద్దా ఉత్సాహంగా జాజిరి ఆడుతున్నారు. సంప్రదాయ పాటలతో కూడిన ఈ జాజిరి ఆట గ్రామీణ సంస్కృతిలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. పిల్లలు, యువకులు, పెద్దలు కలిసి ఆడే ఈ ఆట పండుగకే కాదు, పంటల సంతోషాన్ని పంచుకునే ఆచారంగా కూడా నిలుస్తోంది. జాజిరి ఆడేవారికి పంట దినుసులు దానం చేస్తే ఇల్లు సుఖసంతోషాలతో అభివృద్ధి చెందుతుందన్న నానుడిని పెద్దలు గుర్తుచేస్తున్నారు. పల్లెల్లో జాజిరి ఆట ఉత్సాహంగా కొనసాగుతుండగా.. పట్టణాల్లో మాత్రం క్రమంగా కనుమరుగవుతోందని పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో జాజిరి ఆటలో పాల్గొంటున్న చిన్నారులు కేరింతలు కొడుతూ రహదారులు, వీధుల్లో పాటలతో ఉల్లాసంగా తిరుగుతూ పండుగ వైభవాన్ని మరింతగా పెంచుతున్నారు. కాముని పున్నం మార్చి 3వ తేదీన రావడంతో గ్రామాల్లో ఇప్పటికే పండుగ సందడి మొదలైపోయింది. ఈ సంప్రదాయానికి భావి తరాలకు అందించడం మన బాధ్యత అని గ్రామ పెద్దలు చెబుతున్నారు. జాజిరి పాటలతో తొమ్మిది రోజుల పాటు గ్రామాలు ఉల్లాసంగా మారిపోతూ పండుగ వైభవాన్ని పెంచుతున్నాయి. సంప్రదాయాలు నిలిస్తేనే సంస్కృతి నిలుస్తుందన్న సందేశాన్ని జాజిరి ఆట మరోసారి గుర్తు చేస్తోంది.



# మల్లన్న దర్శనానికి వెళ్తున్న రజక కుటుంబంపై దాడి

- రెండు నెలల పసిపాప మృతి
- బోయినిపల్లిలో రజక సంఘం నిరసన



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ర్యాగల్ల అంజయ్య నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూలు జిల్లాలో మల్లన్న దర్శనానికి వెళ్తున్న రజక కుటుంబంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. సంఘ నాయకుల వివరాల ప్రకారం, చాకలి చంద్రకళ కుటుంబాన్ని కొంతమంది అడ్డుకుని దాడి చేశారని ఆరోపించారు. కుటుంబ సభ్యులపై దాడి సమయంలో రెండు నెలల పసిపాప మృతి చెందడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనలో పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నిరసనలో మైలారం మహేష్, గంగిపెల్లి స్వామి కుమార్, రాజశేఖర్, వినోద్, వెంకటేష్, మల్లేశం, జాన్ పాల్ తదితరులు, రజక సంఘం నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో పెరుగుతున్న దోమల బెడద

- తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి

**వేద న్యూస్, గజ్వేల్:**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో గత కొద్ది రోజులుగా దోమల సమస్య తీవ్రరూపం దాల్చింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో దోమల దాడితో నిద్రలేక అవస్థలు పడుతున్నామని, పగటిపూట కూడా ఇళ్లలో సౌకర్యంగా ఉండలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డ్రైనేజీ కాల్వల్లో నిల్వ నీరు, పిచ్చిమొక్కల పెరుగుదల కారణంగా దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కమిషనర్, వార్డు కౌన్సిలర్లు తక్షణమే స్పందించి ఫాగింగ్, శుభ్రత చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.



వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 24, 2026

# వెంకట్రావుపల్లె, గొల్లపల్లిలో ఆరోగ్య లక్ష్మి కమిటీ ఎన్నిక

**– ఏఎల్ఎంఎస్సీ చైర్మన్లుగా నవీన్ రెడ్డి, లక్ష్మీ**



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావుపల్లె, గొల్లపల్లి గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య లక్ష్మి కమిటీ (ఇూామీాజ) తీర్మాన సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావుపల్లె గ్రామ సర్పంచ్ చల్ల నవీన్ రెడ్డిని కమిటీ చైర్మన్‌గా, గొల్లపల్లి గ్రామ సర్పంచ్ రడం లక్ష్మీని చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే 11 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్లు మాట్లాడుతూ.. గర్భం దాల్చిన వెంటనే గర్భిణీలు పోషకాహారంతో కూడిన సంపూర్ణ భోజనం తీసుకుంటే తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ లక్ష్యంతోనే ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. పథకం సమర్థవంతంగా అమలుకావడానికి కమిటీ సూచనలు, సలహాలు కీలకమని అన్నారు. ప్రతి నెల ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న నేపథ్యంలో, వారిని అంగన్‌వాడీలకు రప్పించే బాధ్యత అందరిదని తెలిపారు. అంగన్‌వాడీల్లో అన్ని సౌకర్యాలు, ప్రయోజనాలు లభిస్తాయని, పిల్లలకు పౌష్టికాహారం అందుతుందని వివరించారు. కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీలకు పంపించాలని కమిటీ తీర్మానించింది. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్ డి. దేవకీ, అంగన్‌వాడీ టీచర్లు చల్ల వాణి, మీసాల సుగుణ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రియాంక, సతీష్, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

**– ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**– 25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాల పంపిణీ**



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

లైసెన్సుదారులైన సర్వేయర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం 25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాలను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన జిల్లాకు చెందిన 66 మంది సర్వేయర్లకు గతంలోనే లైసెన్సులు అందజేసినట్లు గుర్తుచేశారు. గత ఏడాది జిల్లాకు చెందిన సివిల్ విభాగంలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ప్రభుత్వం 50 రోజుల పాటు శిక్షణ అందించిందని తెలిపారు. ఆ శిక్షణ పూర్తి చేసి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 25 మందికి ఈరోజు లైసెన్స్ పత్రాలను అందజేసినట్లు వెల్లడించారు. లైసెన్స్ పొందిన సర్వేయర్లు తమకు కేటాయించిన మండలాల్లో అందుబాటులో ఉండి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, నటరాజ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**– ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్**

**వేద న్యూస్, కరీంనగర్:**

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రఫీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ.. ఇన్సూరెన్సులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. సెస్సును రెండు శాతం పెంచాలని, సహజ మరణ పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచాలని, డెలివరీ, పెండ్లి కానుకగా రూ. లక్ష చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎస్సీ హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలని, జీవో నంబర్ 12ను సవరించి వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలని, వెల్ఫేర్ బోర్డు నిధుల్లో రూ.346 కోట్లు ప్రైవేట్ భీమా కంపెనీలకు కేటాయించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డులో పెండింగ్ క్లెయిమ్‌లకు వెంటనే నిధులు విడుదల చేసి, 60 సంవత్సరాలు దాటిన కార్మికులకు తక్షణమే పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గండె కొమురయ్య మాట్లాడుతూ, వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీని వెంటనే నియమించాలని, 2009 నుంచి రీన్యువల్ కాకుండా ఉన్న 12 లక్షలకు పైగా లేబర్ కార్డులను యుద్ధ ప్రాతిపదికన రీన్యువల్ చేయాలని సూచించారు. కార్మిక శాఖలో ఓబీసీలకు ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మీ సేవ కేంద్రాల్లో అధిక రుసుములు వసూలు



చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పట్టణాల్లో ఉన్న లేబర్ అడ్డాల వద్ద తాగునీరు మరియు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కౌన్సిల్ సభ్యులు రేగుల కుమార్, గామినేని సత్యం, పుట్ట మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ డే లక్ష్యం

**– పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే ధ్యేయం**
**– జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**
**– 27 ఫిర్యాదులు స్వీకరణ**



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, బాధితులకు సత్వర న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల వద్ద నుంచి మొత్తం 27 ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యమని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వినతులు స్వీకరించాలని సూచించారు. అవసరమైతే క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి, చట్టప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తద్వారా పోలీస్ శాఖపై ప్రజల్లో భరోసా, నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని నిరంతరం సమీక్షిస్తూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు

# బోయినిపల్లిలో బీజేపీ నిరసన ర్యాలీ



**– ఎమ్మెల్యే కాటిపల్లి, రాష్ట్ర అధ్యక్షుడు అరెస్టుపై ఖండన**

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావును అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ఈ నిరసన చేపట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకొని అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. కామారెడ్డి, బాన్సువాడ, నాగర్‌కర్నూలు జిల్లాల్లో జరిగిన ఘటనలపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్ట పరిరక్షణలో ప్రభుత్వం సమర్థంగా వ్యవహరించాలన్నారు. ప్రజల హక్కులు, భద్రత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం బీజేపీ కట్టుబడి ఉంటుందని, అక్రమ చర్యలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, స్తంభంపెల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, సీనియర్ నాయకులు సుంకపాక ప్రభు, మెరుపుల గంగాధర్, ఇల్లందుల బాలయ్య, సారంపల్లి రాజు, జనగాం లక్ష్మణ్, మినుముల శ్రీనివాస్, పెంచాలా మహేష్, స్వామి కుమార్, కిరణ్, గంగాధర్ చారి, ముసుకు విజయేందర్ రెడ్డి, రజనీకాంత్, నిఖిల్, వినయ్, రాచర్ల రాజేశం, కల్యాణ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు. నినాదాలతో మండల కేంద్రం మార్మోగగా, అరెస్టులను తక్షణమే ఉపసంహరించుకోవాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రైతు భరోసా విడుదలలో జాప్యం తగదు

**– బీజేపీ కిసాన్ మోర్చా హెచ్చరిక**



**వేద న్యూస్, చందుర్తి:**

ఏసంగి వరి నాట్లు పూర్తై నెలలు గడుస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయడంలో జాప్యం చేయడం సరికాదని చందుర్తి మండల బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు చింతకుంట సాగర్ విమర్శించారు. రైతుల పక్షపాతి అని చెప్పుకునే ప్రస్తుత ప్రభుత్వం రైతులకు ప్రయోజనం చేకూర్చడంలో విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.2 లక్షల రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేసి రైతులకు ఉపశమనం కల్పించాలని కోరారు. లేదంటే రానున్న రోజుల్లో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు

# రిలే నిరాహార దీక్ష శిబిరం ధ్వంసం

**– అర్ధరాత్రి టెంట్‌ను కూల్చిన గుర్తు తెలియని వ్యక్తులు**

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ గ్రామంలో 11/6 కాలువ అసంపూర్తి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గత 14 రోజులుగా గ్రామస్తులు రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో దీక్షను భంగం కలిగించాలనే ఉద్దేశంతో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో దీక్షా శిబిరం వద్దకు వెళ్లి టెంట్‌ను కూల్చి ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇది మొదటిసారి కాదని, మూడు రోజుల క్రితం కూడా ఇలాంటి ఘటన చోటుచేసుకుందని వారు పేర్కొన్నారు. అప్పట్లో కొంత భాగాన్ని మాత్రమే ధ్వంసం చేయగా, ఈసారి పూర్తిగా నేలమట్టం చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ చర్యలను అడ్డుకోవడం దురదృష్టకరమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఘటనపై సంబంధిత అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు అందుబాటులో ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు.

# అటవీశాఖ అధికారిపై దాడి కేసు..

**– నలుగురు నిందితులకు ఆరు నెలల జైలు**
**– నిందితులకు రూ.2వేల చొప్పున జరిమానా**



**వేద న్యూస్, రుద్రంగి:**

2018 సంవత్సరంలో రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో అటవీశాఖ అధికారిపై దాడి చేసిన కేసులో నలుగురు నిందితులకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానా విధిస్తూ వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు రుద్రంగి ఎస్ఐ తెలిపారు. మానాల గ్రామానికి చెందిన గుగులోతు మదన్, గుగులోతు గజల్, అజ్మీర బన్సీ, బత్తుల లక్ష్మయ్యలు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పేర్ల సిద్ధార్థపై భౌతిక దాడి చేసి గాయపరిచినట్లు అప్పట్లో ఫిర్యాదు నమోదైంది. ఈ మేరకు 2018లో అప్పటి రుద్రంగి ఎస్ఐ ఎస్. విద్యాసాగర్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ సంద శ్రీనివాస్ సాక్షులను హాజరు పరచగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రాంత్ వాదనలు వినిపించారు. కేసులోని సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నలుగురు నిందితులకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించారు. ప్రభుత్వ అధికారులు లేదా అటవీశాఖ సిబ్బందిపై దాడులు చేసి విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని రుద్రంగి ఎస్ఐ మోతిరాం తెలిపారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073